www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 22 | ఆగస్టు | 2026
పేజీలు : 8

## కొదుమూరులో యువజన ప్రదర్శన




2 లో

# యువతను విస్మరిస్తే పతనం తప్పదు












**-దిమాగి నక్సల్స్ ప్రకటన అసహనానికి నిదర్శనం**
**-అధ్యయనం, పోరాటం అలవర్చుకోవాలి**
**-యువజన సమాఖ్య జిల్లా మహాసభలో కూనంనేని**
**-పోరాటాల కాణాచి యువజన సమాఖ్య : దర్మేంద్ర, వల్లీ**




**ప్రజాపక్షం/ఖమ్మం :** పాలకులు యువతను విస్మరిస్తే పతనం తప్పదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి , ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు హెచ్చరించారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉపాధి ఉద్యోగ రంగాలు వట్టి పోతున్నాయని తద్వారా దేశంలో నిరుద్యోగం పెరిగిపోతుందని ఉపాధి లేక యువశక్తి నిర్వర్యం అవుతుం దని ఆయన తెలిపారు. అఖిల భారత యువజన సమాఖ్య(ఎఐవైఎఫ్) ఖమ్మం జిల్లా 25వ మహాసభలు శుక్రవారం చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో పగడాల భరత్ ప్రాంగణంలో జరిగింది. మహాసభకు ముందు గ్రామంలోవందలాది మంది యువకులు భారీ ప్రదర్శన నిర్వహించారు.మహా సభ ప్రారంభ సూచికగా ఎఐవైఎఫ్ పతాకాన్ని కొండపర్తి గోవిందరావు , అమర వీరుల స్థూపాన్ని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ ఆవిష్కరించారు. మహ్మద్ గౌస్ పాషా, అబ్బూరి మహేష్, దండి శ్రీజ, మామిడి కిరణ్, యమున అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన మహాసభకు ముఖ్యఅతిధిగా హాజరైన కూనంనేని మాట్లాడుతూ యువజన సమాఖ్య కార్యకర్తలు సామాజిక కర్తవ్యాన్ని నెరవేర్చే క్రమంలో ముందు వరుసలో నిలబడాలని సూచించారు. దేశ జనాభాలో సగం కలిగిన యువత హక్కుల కోసం

మిగతా 2లో..

## పల్లెల్లో ఉద్యోగం.. పట్టణంలో నివాసం..!



**-ఆలస్యంగా రావడం.. తొందరగా వెళ్లడం**
**-నిబంధనలకు పాతరు.. ఇంటి అద్దెలు స్వాహా**

**ప్రజాపక్షం/జూలూరుపాడు:** వారు ప్రభుత్వానికి, ప్రజలకు వారధులు. ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను ప్రజలకు చేరవేయడంలో వారిదే కీలకపాత్ర. కానీ వారే నిబంధనలకు పాతరేస్తున్నారు. ఉద్యోగం ఒకచోట చేస్తారు. వాసం మరోచోట. ఇంకేముందే సమయానికి రారు. పని చేయరు. ఇదీ మన ప్రభుత్వ ఉద్యోగుల పనితీరు. ప్రభుత్వం వేలకోట్ల రూపాయలు వెచ్చించి ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు చేరవేయడంలో ప్రభుత్వ ఉద్యోగుల దే కీలకపాత్ర ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా వ్యవహరించేది వారే. అందుకే ప్రభుత్వం పని చేసేచోట నివాసముండాలని నిబంధన విధించింది. జూలూరుపాడు మండలంలోని 60 శాతం మంది ప్రభుత్వ ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్నారు. దీంతో అవసరమైన సమయాల్లో ఉద్యోగులు అందుబాటులో లేకపోవడంతో ప్రజలు తీవ్రఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పని నిమిత్తం దూరప్రాంతాల నుంచి ఉదయాన్నే కార్యాలయాలకు వచ్చే ప్రజలు అధికారి ఎప్పుడు వస్తాడా అని ఎదురుచూడాల్సి వస్తోంది.

**ఆలస్యంగా రావడం.. తొందరగా వెళ్లడం...!**

ఇతర ప్రాంతాల్లో నివాసముంటున్న అధికారులు వారు పని చేసే ప్రాంతాలు దూరంగా ఉండడంతో కార్యాలయాలకు సమయానికి రాలేకపోతున్నారు. కొంతమంది ఉద్యోగులు రవాణా సౌకర్యం సక్రమంగా లేదన్న సాకుతో వెళ్లాల్సిన సమయానికంటే ముందుగానే వెళ్తున్నారు. దీంతో పనినిమిత్తం ప్రజలు రోజుల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తోంది.

**- అందరిదీ అదే దారి..!**

జూలూరుపాడు మండల పరిధిలోని రెవెన్యూ, మండల ప్రజా పరిషత్, వైద్య, విద్యా, వ్యవసాయం ఇతర ప్రభుత్వ శాఖలకు

మిగతా 2లో..




**-ఎంఆర్‌పిపై రూ. 30ల నుంచి రూ. 40ల వరకు బాదుడు**
**-తగ్గని బెల్ట్ జోరు**
**-చోద్యం చూస్తున్న ఎక్సైజ్**

## మధిరలో సిండికేట్ దందా..!

**ప్రజాపక్షం/ మధిర :** మధిరలో సిండికేట్ హవా నడుస్తుంది. ఎక్సైజ్ అధికారులు యధాశక్తి సహకరిస్తుండడంతో మద్యం వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతుంది. జిల్లాలో ఎక్కడలేనివిధంగా ఎంఆర్‌పిపై రూ. 30ల నుంచి ఆయా సందర్భాలను బట్టి రూ. 40ల వరకు వసూలు చేస్తున్నారు. మద్యం దుకాణ యజమానుల కను సన్నల్లోనే బెల్ట్‌షాపులను నిర్వహిస్తూ సామాన్యమైన మద్యం నుంచి

మిగతా 2లో..



# యువతను విస్మరిస్తే పతనం తప్పదు







**(మొదటిపేజీ తరువాయి)**
పోరాడాలని, పోరాడకుండా ఏ హక్కులు సాధించబడలేదన్నారు. సమాజాన్ని మార్చగలిగే శక్తి యువతరానికి ఉందని అందుకే చైతన్యవంతులైన ఈ తరాన్ని చూసి మోడీ భయపడుతున్నాడని సాంబశివరావు తెలిపారు.మోడీ విధానాల కారణంగా యువత తీవ్ర అసహనానికి గురైందని, అసహనం నుంచి ఆవేశం వచ్చిందని దీంతో మోడీ తలవంచక తప్పలేదని ఆయన తెలిపారు.యువతరం ముఖ్యంగా జెన్ జీ వీధుల్లోకి పోరాట మార్గం ఎంచుకోవటంతో మోడీ అహంకారంపై తొలి వేటు పడిందన్నారు. అందుకే స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా దిమాగీ నక్సల్స్ అన్న పదాన్ని తెరపైకి తెచ్చి ప్రశ్నించేవారిని దిమాగీ నక్సల్స్‌గా ముద్ర వేసి నిర్బందించే ప్రయత్నం చేస్తుందని కూనంనేని తెలిపారు. మావోయిస్టులను లేదా కమ్యూనిస్టులను బౌతికంగా హతమార్చినా భావజాలాన్ని తుద ముట్టించేందుకు దిమాగి నక్సల్స్ పేరుతో నిర్బందాలు, హతమార్చటం లాంటి చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆయన తెలిపారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన మోడీ ఉన్న ఉద్యోగాలను ఊడగొడుతున్నారని మోడీ ఏవలం అంబానీ, అదానీ కోసం ప్రదానిగా పని చేస్తున్నారని కూనంనేని ఆరోపించారు. ప్రపంచ వ్యాప్తంగా వామపక్ష భావజాలం పెరుగుతుందని, పెట్టుబడిదారి దేశం అమెరికాలో ట్రంప్‌కు వ్యతిరేకంగా సోషలిస్టులు వరుస విజయాలు సాధిస్తున్నారని న్యూయార్క్ మేయర్‌ను సోషలిస్టు భావజాలం ఉన వ్యక్తి గెలుచుకున్నారన్నారు. సమాజ చోధకశక్తి యువతేనని మారిన మారుతున్న పరిణామాలను నిరంతరం అధ్యయనం చేస్తూ పోరాటతత్వాన్ని అలవర్చుకోవాలి. యువత సైద్దాంతిక నైతిక శారీరక బలాన్ని పెంపొందించుకోవాలని యువతకు సూచించారు.

**పోరాటాల కాణాచి ఎఐవైఎఫ్ : వలీ, దర్మేంద్ర**
భారతదేశ యువజనోద్యమాలకు దిక్సూచి ఎఐవైఎఫ్ అని పోరాటాల కాణాచిగా పెరుగాంచిందని ఎఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీ ఉల్లా ఖాద్రీ, కల్లూరి దర్మేంద్ర తెలిపారు.యువజన సమాఖ్య మహాసభలో వారు మాట్లాడుతూ పాలకులు యువతకు సంబందించిన ఏ పథకాలను అమలు చేయటం లేదని ఆరోపించారు.యువతకు ఉపాధి ఉద్యోగాల కోసం ఏఐవైఎఫ్ పోరాడుతుందని వారు తెలిపారు. ఉద్యోగ ఉపాదికల్పనకు సంబంధించి పాలకులు కార్యాచరణ ప్రకటించాలని డిమండ్ చేశారు.బయ్యారం ఉక్కు పరిశ్రమ సాధన కోసం పోరాడతామని, వలీ, దర్మేంద్ర తెలిపారు. ఈ మహాసభలలో సిపిఐ జాతియ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, కొండపర్తి గోవిందరావు, నానబాల రామకృష్ణ తదితరులు ప్రసంగించగా సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు యర్రా బాబు, షేక్ జానిమియా, ఎపూరి లతాదేవి, బిజి క్లెమెంట్ పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పావులూరి మల్లిఖార్జున రావు, కొల్లి రవి, అహ్వాన సంఘం అధ్యక్షులు కొల్లి శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి దూసరి గోపాలరావు, ఏఐఎస్ఎఫ నాయకులు రామకృష్ణ, లక్ష్మ ణ్, ఏఐవైఎఫ్ నాయకులు శ్రీనాధ్ రెడ్డి, శ్రావణ్, చింతల రమేష్, కొల్లి రవి తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రమాదకరంగా గేట్ వాల్ ఛాంబర్

**ప్రజాపక్షం/కల్లూరుః** కల్లూరు మండల పరిధిలోని పేరువంచలో పేరువంచ టు నారాయణపురం కొర్లగూడెం వెళుతున్న రహదారి వెంట గేటు వాల్ ఛాంబర్ ప్రమాదకరంగా ఉందని స్థానికులు తెలుపుతున్నారు. దానిపై మూత వేసి ప్రమాదాన్ని నివారించాలని స్థానికులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు వేడుకుంటున్నారు. తరచూ ఈ రహదారిపై నారాయణపురం కొర్లగూడెం, పేరువంచ గ్రామాల వారు నిత్యం తిరుగుతుంటారని ప్రమాదకరంగా ఉన్న గేట్ వాల్ ఛాంబర్ పై మూత వేసి ప్రమాదం జరగకుండా నివారించాలని సర్పంచ్ మరియు కార్యదర్శిని పాలకవర్గాన్ని కోరుతున్నారు. ఈ విషయమై కార్య దర్శిని వివరణ కోరగా సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.

## మిర్చి సాగును ప్రారంభించిన రైతులు

ప్రజాపక్షం/కల్లూరుః కల్లూరు మండల పరిధిలోని పలు గ్రామాలలో మిర్చి సాగును రైతులు ప్రారంభించారు. మండల పరిధిలోని చిన్న కోరుకొండి, పెద్ద కోరుకొండి, పోచవరం, తాళ్లూరు వెంకటాపురం, బత్తులపల్లి, ముచ్చవరం, పాయపూరు, మర్లపాడు, దారుక బంజర్, తదితర గ్రామాలలో 1200 ఎకరాలలో 500 మంది రైతులు సాగుకు సిద్ధమయ్యారు. మండలంలో రైతులు తమ యొక్క పెట్టుబడి ప్రణాళికలతో ఖరీఫ్ సీజన్లో ఈ పంటను ప్రారంభించారు. గత రెండు మూడు రోజుల నుంచి పడుతున్న వర్షానికి గాను రైతులు మిర్చి పంటకు సాగుకు సిద్ధమయ్యారు.

## కొదుమూరులో యువజన ప్రదర్శన

**ప్రజాపక్షం/చింతకాని :** అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్)ఖమ్మం జిల్లా 25వ మహాసభల సందర్బంగా శుక్రవారం యువజనులు కదం త్కొరు. చింతకాని మండలం కొదుమూరు గ్రామంలో ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన యువత చేతిలో ఏఐవైఎఫ్ జెండాతో ప్రదర్శనలో పాల్గొన్నారు. 25వ మహాసభ ప్రారంభ సూచికగా 25 మంది యువకులు పతాకాలను చేబూని ప్రదర్శన అగ్రభాగాన నిల్చారు. ప్రదర్శన అగ్రభాగాన ఏఐవైఎఫ్ మాజీ నాయకులు ఆహ్వాన సంఘం భాధ్యులు కొండపర్తి గోవిందరావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వలీఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర , జిల్లా నాయకులు నానబాట రామకృష్ణ, చింతల రమేష్, శ్రావణ్, శ్రీనాధ్ రెడ్డి, ఉపేదర్, జిల్లా కార్యవర్గ సభ్యులు కూచిపుడి రవి, సిపిఐ చింతకాని మండల కార్యదర్శి దూసరి గోపాలరావు, సహాయ కార్యదర్శి అబ్బూరి మహేష్, దొబ్బల వెంగళరావు, కొల్లి శ్రీనివాసరావు తదితరులు నడవగా ప్రదర్శన కొదుమూరు పుర వీధుల గుండా సాగి మహాసభ ప్రాంగణానికి చేరుకుంది. యువజన సమాఖ్య పతాకాన్ని కొండపర్తి గోవిందరావు ఆవిష్కరించగా మృతవీరుల స్మారక స్థూపం వద్ద సీపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్,పూలమా వేసి నివాళులర్పించగా నాయకులు కార్యకర్తలు నివాళులర్పించారు.

## 13వ వార్డులో రోడ్డు మరమ్మతులు

**పరిశీలించిన చైర్‌పర్సన్ చంద్రకళ**





**ప్రజాపక్షం/వైరాః** వైరా మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో రోడ్డు మరమ్మత్తు పనులు చేపట్టారు. శుక్రవారం మన్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ రోడ్డు పనులను పరిశీలించారు. డోజర్ సహాయంతో రోడ్డుపై పేరుకు పోయిన బురదను తొలగించి అనంతరం రెడ్‌మిక్స్‌తో రోడ్డును చదును చేశారు. ఈ సందర్భంగా చైర్‌ఫర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నట్లు తెలిపారు. రోడ్డుపై బురద పేరుకుపోయిన విషయం తెలిసిన వెంటనే మున్సిపల్ అధికారులను ఆదేశించి మరమ్మత్తు పనులు చేపట్టినట్లు చెపాపరు. త్వరలోనే మున్సిపాలిటీ పరిధిలో రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని తెలిపారు. ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ మున్సిపాలిటీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, ఇప్పటికే రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరైనట్లు పేర్కొన్నారు.

## మధిరలో సిండికేట్ దందా..!

**(మొదటిపేజీ తరువాయి)**
అతి ఖరీదైన మద్యం వరకు బెల్ట్ షాపుల ద్వారా విక్రయిస్తున్నారు.బార్ షాపుల్లో ఎంఆర్‌పిపై అదనంగా విక్రయిస్తున్నట్లు మద్యం ప్రియులు వాపోతున్నారు. బెల్ట్ షాపుల నిర్వహణ వెనుక మధిరలో వైన్ షాపులు నిర్వహిస్తున్న ఓ వ్యాపారి అత్యంత కీలకంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఆంధ్రా ప్రాంతానికి సరిహద్దుగా ఉండటం, ఆంధ్రాలోని మద్యం ప్రియులకు ఆ రాష్ట్ర మద్యం అంతగా రుచించక పోవడంతో ఇప్పటికీ మధిర మండలంలోని మద్యం షాపుల్లో నిత్యం మద్యం కొనుగోలు చేస్తుండడంతో వ్యాపారం జోరుగానే సాగుతుంది. ఇది చాలదన్నట్లు మద్యం ప్రియులను దోచుకునేందుకు ఇష్టాను సారంగా ధర పెంచి విక్రయాలు జరుపుతున్నారు. ఇంత జరుగుతున్న మధిర ఎక్సైజ్ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూడటం లేదు. ఎవరు ఏమి చేసుకుంటే మన పని మనం చేసుకుందాం అన్నట్లుగా ఎక్సైజ్ అధికారులు వ్యవహరిస్తున్నారు. నిబంధనలకు విరుద్దంగా మద్యం విక్రయాలు జరుగుతున్నా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నా ఎక్సైజ్ అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. మద్యం వ్యాపారుల దోపిడీ శృతి మించడంతో కొందరు మద్యం ప్రియులు ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించలేదని సమాచారం. సిండికేట్ పేరుతో మద్యం ప్రియులను దోపిడీ చేస్తున్న వారిపై తగు విచారణ జరిపి ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని అదేవిధంగా సిండికేట్‌కు సహకరిస్తున్న ఎక్సైజ్ అధికారులపైన విచారణ జరపాలని కోరుతున్నారు.మద్యం సిండికేట్, ఎక్సైజ్ అధికారుల చట్ట పట్టాలపై విచారణ జరపాలని, మద్యం దోపిడీని నిలువరించాలని మద్యం ప్రియుల కుటుంబ సభ్యులు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పల్లెల్లో ఉద్యోగం.. పట్టణంలో నివాసం..!

**(మొదటిపేజీ తరువాయి)** చెందిన ఉద్యోగులు. ప్రధానంగా తహశీల్దార్, ఎంపీడీవో, మండల విద్యాధికారులు, ప్రభుత్వ ఉపాధ్యాయులు, వైద్యాధి కారి, రెవెన్యూ అధికారులు, ఫారెస్ట్ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ఇతర ప్రాంతాల్లో ఉంటున్నారు. సమయానికి కార్యాలయాలకు ఉద్యోగులు, పాఠశాలలకు ఉపాధ్యాయులు రావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

**ఇంటి అద్దెలు స్వాహా..!**
ప్రభుత్వ ఉద్యోగులకు వారి హోదాలకు అనుగుణంగా ప్రభుత్వం వేలాది రూపాయలు ఇంటి అద్దె రూపంలో చెల్లిస్తుంది. కోందరు ఉద్యోగులు స్థానికంగా ఉంటున్నట్లు రుజువులు చూపిస్తున్నా వాస్తవానికి చాలా మంది అదికారులు పట్టణాల్లో నివాసముంటున్నారు. దీంతో ప్రజాధనం అధిక మొత్తంలో దుర్వినియోగం అవుతోంది. ఇలా అధికారులు స్థానికంగా ఉండక పోవడంతో పనుల్లో జాప్యం నెలకొంటోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవచూపి జూలూరుపాడు మండలంలోని ప్రభుత్వ ఉద్యోగులు పని చేసే చోటే నివాసం ఉండేలా, నిర్ణీత సమయాల్లో విధులకు సక్రమంగా హాజరయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

# గోదావరి జలాలను తాగునీటి అవసరాలకు వినియోగించుకోవాలి

**-జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గోదావరి జలాలను తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు. జిల్లాలోని వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని కలెక్టర్ దివాకర టిఎస్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఏన్కూరు, కల్లూరు, వేంసూరు మండలాల్లో పలు ప్రాంతాల్లోని కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని, లభ్యతను పరిశీలించి అధికారులతో పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం సూపర్ ఎల్నినో పరిస్థితుల ప్రభావంతో కృష్ణా బేసిన్ పరిధిలో వర్షపాతం తక్కువగా నమోదవుతున్న నేపథ్యంలో గోదావరి నుంచి తరలిస్తున్న నీటిని తాగునీటి అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ వినియోగించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తకుండా అవసరమైన ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అందుబాటులో ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించాలని వివిధ కాలువలు, రెగ్యులేటర్లు, చెరువులకు చేరుతున్న నీటి ప్రవాహాన్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. నీటి ప్రవాహాల్లో ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా కాలువలు, రెగ్యులేటర్లు, అవుట్‌లెట్లను నిరంతరం తనిఖీ చేయాలని, నీటి లభ్యతను బట్టి చెరువులను నింపేందుకు సమన్వయంతో చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ సిఈ వాసంతి, ఖమ్మం ఎస్ఈ ఎం. వెంకటేశ్వర్లు, కల్లూరు ఎస్ఈ శ్రీకాంత్, వైరా ఈఈ బాబురావు, సత్తుపల్లి ఈఈ అర్జున్, డిఈలు, ఏఈలు, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలి

**-జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ఓటర్ల జాబితా సమగ్ర సవరణ ప్రక్రియ రెండవ దశను పకడ్బందీగా చేపట్టాలని కాంగ్రెస్ నేతలకు కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్ సూచించారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయం సంజీవ రెడ్డి భవన్‌లో శుక్రవారం నూతి సత్యనారాయణ గౌడ్ అధ్యక్షతన మండల, పట్టణ అధ్యక్షులు, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నూతి సత్యనారాయణ గౌడ్ మాట్లాడుతూ ఎస్ఐఆర్ ప్రక్రియ మొదటి దశను విజయవంతంగా నిర్వహించిన కాంగ్రెస్ శ్రేణులకు అభినందనలు తెలిపారు. రెండవ దశను కూడా పకడ్బందీగా చేపట్టాలని ఆయన సూచించారు. ఇంటింటికి వెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు తుది ఓటరు జాబితాలో ఉండేలా చూడాలన్నారు. బూత్ స్థాయి ఏజెంట్లు ముసాయిదా ఓటరు జాబితాలో ఏమైనా అభ్యంతరాలు, క్లెయిమ్‌లు ఉంటే సెప్టెంబర్ 16లోపు దరఖాస్తు చేయాలన్నారు. నిర్ణీత గడువు లోగా మండల, పట్టణ, గ్రామ వార్డుల కమిటీల నియామకాలను పూర్తి చేయాలని తెలిపారు. కేంద్ర మంత్రి అమిత్‌షా కాంగ్రెస్ పార్టీపై చేసిన వ్యాఖ్యాలను, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమెరికా పర్యటన పట్ల కేంద్ర ప్రభుత్వ వైఖరిని తీవ్రంగా ఖండించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ప్రధాన కార్యదర్శి మద్దినేని స్వర్ణకుమారి, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, సయ్యద్ గౌస్, మొక్కా శేఖర్ గౌడ్, డా॥ కాపా మురళీకృష్ణ, బొడ్డు బొందయ్య, పుచ్చకాయల వీరభద్రం, సయ్యద్ ముజాహీద్ హుస్సేన్, ఆర్టిఏ మెంబర్ గజ్జెల్లి వెంకన్న, జిల్లా కాంగ్రెస్ కమిటీ సభ్యులు, మండల, పట్టణ అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్‌వేర్ డెవలపర్ ఉద్యోగాలకు ఎస్‌బిఐటి విద్యార్థుల ఎంపిక



**ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ :** స్వర్ణ భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఆఫ్ టెక్నాలజీ (అటానమస్) విద్యార్థులు బహుళ జాతి సంస్థ ష్యూర్ ఇంటర్నేషనల్ ఎల్ఎఎల్‌సి సంస్థలో సాఫ్ట్‌వేర్ డెవలపర్ అసోసియేట్ ఉద్యోగాలు సాధించి కళాశాలకు గర్వకారణంగా నిలిచారని కళాశాల ఛైర్మన్ గుండాల కృష్ణ తెలిపారు. అమెరికా కేంద్రంగా నిర్వహించబడుతూ మలేషియా, ఒమన్, ఖతార్, భారత్ వంటి దేశాల్లో విస్తృతంగా వ్యాపిస్తున్న బహుళ జాతి సంస్థలో తమ కళాశాల విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డా॥ జి. ధాత్రి మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్ ఆఫ్ ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణా కార్యక్రమాలు, సాంకేతిక నైపుణ్యాభివృద్ధి, కమ్యూనికేషన్ స్కిల్స్, అప్టిట్యూడ్, కోడింగ్ శిక్షణలను సద్వినియోగం చేసుకున్న 10 మంది సిఎస్ఈ, సిఎస్ఎం, సిఎస్‌డి విద్యార్థులు ప్రతిభ కనబర్చి ఉద్యోగాలకు ఎంపికయ్యారని తెలిపారు. వివిధ దశల్లో నిర్వహించిన ఎంపిక ప్రక్రియలో 173 మంది పాల్గొనగా ఆన్‌లైన్, అసెస్‌మెంట్ టెక్నికల్ రౌండ్, హెచ్‌ఆర్ రౌండ్ల అనంతరం 10 మంది ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థుల్లో పసుమర్తి సాయి అవినాష్ రూ. 12 లక్షల వార్షిక వేతనాన్ని అందుకోనున్నట్లు ప్రిన్సిపాల్ జి. రాజ్‌కుమార్ తెలిపారు. ఒకరికి రూ. 12 లక్షలు, ముగ్గురికి రూ. 10 లక్షలు, ఆరుగురికి రూ. 6 లక్షల ప్యాకేజీతో ఉద్యోగాలు పొందినట్లు వైస్ ఛైర్మన్ కె. శ్రీచైతన్య తెలిపారు. ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో ష్యూర్ సంస్థ ప్రతినిధులు, చీఫ్ టెక్నికల్ ఆఫీసర్ వివేక్, సీనియర్ హెచ్‌ఆర్ పూజ, అకాడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్ కుమార్, గంధం శ్రీనివాసరావు, ఎవివి శివప్రసాద్, టిపివో సవిత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా స్థాయిలో సాయిస్ఫూర్తి విద్యార్థుల హవా

**బీటెక్, ఎంబీఏ ద్వితీయ సెమిస్టర్ ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ**




**ప్రజాపక్షం/సత్తుపల్లి:** సాయిస్ఫూర్తి అటానమస్ ఇంజనీరింగ్ కళాశాల బీటెక్, ఎంబీఏ ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ఖమ్మం జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారని కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ దాసరి ప్రభాకర్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ వూటుకూరి శేషారత్నకుమారిలు ఒక ప్రకటనలో తెలిపారు. జేఎన్‌టీయూ హైదరాబాద్ అనుమతితో శుక్రవారం విడుదలైన ఫలితాల్లో వివిధ బ్రాంచీల్లో విద్యార్థులు అత్యధిక ఎస్‌జీపీఏ సాధించారు. సీఎస్ఎంలో బమ్మిడి కళాంజలి 9.55 ఎస్‌జీపీఏ (90.5%), ఈసీఈలో గుగులోతు గణేష్ 9.55 (90.5%), ఏఐడీఎస్‌లో చాగంరెడ్డి దివ్యవాణి 9.25, సీఎస్‌సీలో పాలెం రమ్యస్ఫూర్తి 9.10, ట్రిపుల్‌ఈలో పేటేటి లక్ష్మీ కార్తీక్ 8.30, ఎంబీఏలో బండ్ల రాకేష్ 8.61 ఎస్‌జీపీఏ (81.1%) సాధించి ప్రథమ స్థానాల్లో నిలిచారు. విద్యార్థుల విజయంపై కళాశాల చైర్మన్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ బండి పార్థసారథిరెడ్డి, ట్రస్టీ బండి అన్విద అభినందనలు తెలిపారు. విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర శ్రమతో పాటు అధ్యాపకులు, తల్లిదండ్రుల సహకారం ఈ విజయానికి కారణమని దాసరి ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. పరీక్షా ఫలితాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత విజయాలు సాధించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ శేషారత్నకుమారి ఆకాంక్షించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సృజనాత్మకత, నైపుణ్యాలను పెంపొందించేందుకు కళాశాల అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు.కళాశాల కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పాముల శేఖర్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ యాకూబ్, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ షేక్ మీరాసాహెబ్, వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపకులు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

# స్మార్ట్ రేషన్‌కార్డుల పంపిణీ



**ప్రజాపక్షం/ముదిగొండ:** మండల పరిధిలోని ముత్తారం గ్రామంలో శుక్రవారం నూతన స్మార్ట్ రేషన్‌కార్డులను సర్పంచి, ఉప సర్పంచులు లంజపల్లి మమత, చింతకాయల వెంకటరమణ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు మరింత సులభంగా, పారదర్శకంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికీ రేషన్‌కార్డు అందేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు తాళ్ల కోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కొప్పుల రామయ్య, నాయకుడు లంజపల్లి బుచ్చయ్య, పంచాయతీ కార్యదర్శి వీరబాబు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# నిర్మాణంలో ఉన్న ఇంటి వైరింగ్ వైర్ల చోరీ



**ప్రజాపక్షం/వైరా:** ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులోని నిర్మాణంలో ఉన్న ఇంట్లో వైరింగ్ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను గుర్తుతెలియని దుండగులు చోరీ చేశారు. చెరుకూరి చలపతిరావుకు చెందిన వెంచర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంటిని లక్ష్యంగా చేసుకున్న దుండగులు, వైరింగ్ బాక్సుల్లో ఏర్పాటు చేసిన వైర్లను ఎత్తుకెళ్లారు. ఇంటిని పరిశీలించిన సమయంలో వైరింగ్ బాక్సుల్లో వైర్లు కనిపించకపోవడంతో చోరీ జరిగిన విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనలో ఆస్తి నష్టం జరిగినట్లు బాధితులు తెలిపారు. ఇదే ప్రాంతంలో గతంలో కూడా చోరీ జరిగినట్లు పేర్కొన్నారు. నిర్మాణ ప్రాంతాల్లో వరుసగా చోరీలు జరుగుతుండటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు గస్తీ పెంచి దొంగతనాలకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.

# వృద్ధులకు గౌరవ ప్రదమైన జీవనం కల్పించడమే ధ్యేయం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వృద్ధులకు గౌరవ ప్రధమైన జీవనం కల్పించడమే న్యాయ సేవాధికార సంస్థ లక్ష్యమని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డిఎల్ఎస్ఏ) కార్యదర్శి పి. దేవి మానస తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో వయో వృద్ధుల సంఘం సహకారంతో ప్రపంచ వయో వృద్ధుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎల్ఎస్ఏ కార్యదర్శి పి. దేవి మానస మాట్లాడుతూ వయో వృద్ధుల కోసం ఉన్న చట్టాలు, సంక్షేమ పథకాలు, నాల్స పథకాల గురించి వివరించారు. వృద్ధులకు గౌరవ ప్రధమైన జీవితం, న్యాయం అందుబాటులో ఉండటం, భరణం, వేధింపులు లేని జీవితం కల్పించడమే ప్రధాన లక్ష్యమన్నారు. వయో వృద్ధుల సంరక్షణ చట్టం, ఉచిత న్యాయ సహాయం, హెల్ప్ లైన్ సేవల గురించి అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి ప్రమీల, ప్యానల్ న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు, వయో వృద్ధుల సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# నేడు వైరాలో ఎంప్లాయిమెంట్ కార్డు రిజిస్ట్రేషన్ మేళా

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** వైరా పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సౌకర్యంగా ఉండేందుకు జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఖమ్మం ఆధ్వర్యంలో నేడు వైరాలో ఎంప్లాయిమెంట్ కార్డు రిజిస్ట్రేషన్ మేళా, కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎన్.మాధవి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వైరాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఎంప్లాయిమెంట్ కార్డు కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఆన్‌లైన్ విధానంలోనే కొనసాగుతున్నప్పటికీ వైరా పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు,నిరుద్యోగ యువతకు సౌకర్యంగా ఉండేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, ఆధార్ కార్డు, కుల ధృవీకరణ పత్రాలతో వచ్చి మ్యాన్‌వల్‌గా దరఖాస్తు ఫారం నింపవచ్చునని తెలిపారు. అనంతరం అభ్యర్థుల వివరాలను ఉపాధి కల్పన కార్యాలయం ద్వారా నమోదు చేసి ఎంప్లాయిమెంట్ కార్డు పొందే విధంగా అవసరమైన సహాయాన్ని అందించనున్నట్లు తెలిపారు. ఇంటర్మీడియట్ అనంతరం ఉన్నత విద్యలో ఎలాంటి కోర్సులను ఎంచుకోవాలి, వివిధ కెరీర్ అవకాశాలు, భవిష్యత్తు ప్రణాళికలు, ఉద్యోగ మేళాలు, శిక్షణా కార్యక్రమాలు తదితర అంశాలపై విద్యార్థులకు ప్రత్యేకంగా కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఉపాధి కల్పనాధికారి తెలిపారు. వైరా పరిసర ప్రాంతాలకు చెందిన విద్యార్థులు, నిరుద్యోగ యువత ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఉపాధి కల్పనాధికారి కోరారు.

# మండలంలోని రైతు సోదరులకు విజ్ఞప్తి



**ప్రజాపక్షం/ ఎర్రుపాలెం :** మండలంలోని అయ్యవారిగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం నందు ఎఫ్ఎఫ్ఎస్ యాప్ నందు సాంకేతిక లోపం వలన స్టాక్ లేకపోయినా ఎరువులు బుక్ అవుతున్నట్లు, ఈ విషయాన్ని రైతులు గమనించాలని సంఘం అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు తెలిపారు. ఎఫ్ఎఫ్ఎస్ యాప్ నందు ఎరువులు స్టాక్ లేకపోయినా ఎరువులు ఉన్నట్లు బుక్ అవుతున్నాయని, ఈ విషయాన్ని వ్యవసాయాధికారి శివకు, మధిర ఎడిఎకి తెలపగా యాప్‌లో సాంకేతిక లోపం ఉన్నట్లు తెలిపినట్లు తెలిపారు. రైతులు సోదరులు ఆందోళన చెందకుండా ఉండాలని, సంఘం ద్వారా ఎరువులు రైతులకు అందిస్తామని తెలిపారు.

# యువజన సమాఖ్య జిల్లా మహాసభ దృశ్యమాలిక




















# సర్కారు దవాఖానలో కార్పొరేట్ వైద్యం

**- ఫలించిన కూనంనేని కృషి**
**- త్వరలో క్యాథ్‌ల్యాబ్**
**- జిజిహెచ్‌కు రూ.3 కోట్ల నిధులు**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** నియోజకవర్గ ప్రజలతో పాటు జిల్లా ప్రజలకు మెరుగైన వైద్యం కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించేందుకు స్థానిక ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు చేసి విశేష కృషి ఎట్ట కేలకు ఫలించింది. పేద, మధ్య తరగతి ప్రజలకు అధునాతన వైద్యం అందుబాటులో ఉంచాలనే సంకల్పంతో ఆయన ప్రభుత్వంపై నిరంతరం ఒత్తిడి తెచ్చి ప్రత్యేకంగా రూ.3 కోట్ల నిధులను మంజూరు చేయించారు. ఈ నిధులతో కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి)జిహెచ్)లో అత్యాధునిక సౌకర్యాలు సమకూరనున్నాయి. ప్రధానంగా గుండె సంబంధిత వ్యాధులతో బాధపడే రోగుల ప్రాణాలను కాపాడేందుకు కీలకమైన అధునాతన క్యాథ్ ల్యాబ్ సేవలను ఇక్కడ త్వరలోనే ప్రారంభించనున్నారు. దీంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో మెరుగైన చికిత్స అందించేందుకు ప్రత్యేకంగా క్రిటికల్ కేర్ యూనిట్ (సిసియూ)ను ఏర్పాటు చేస్తున్నారు. వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం పేదలు ప్రైవేటు కేంద్రాలకు వెళ్లి వేలకు వేలు ఖర్చు చేయకుండా ఆస్పత్రిలో అత్యాధునిక ఎంఆర్‌ఐ స్కానింగ్ సౌకర్యాన్ని అందుబాటులోనికి తీసుకురానున్నారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడే రోగుల కోసం అన్ని హంగులతో కూడిన 20 పడకల ఐసియు విభాగాన్ని కూడా సిద్ధం చేస్తున్నారు. గతంలో గుండె పోటు లేదా తీవ్రమైన అత్యవసర పరిస్థితులు ఏర్పడితే మెరుగైన వైద్యం కోసం సుదూర ప్రాంతాలైన హైదరాబాద్,ఖమ్మం వంటి నగరాలకు పరుగులుతీయాల్సి వస్తోంది. సకాలంలో వైద్యం అందక మార్గ మధ్యలో ఎందరో నిస్సహాయ స్థితిలో ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటనలు అనేకం ఉన్నాయి. ఇప్పుడు జిజిహెచ్ లోనే కార్పొరేట్ ఆస్పత్రులకు ధీటుగా ఈ అన్నిరకాల అత్యున్నత వైద్య సేవలు సమకూరనుండటంతో స్థానిక ప్రజలకు ఎంతో మేలు జరగనుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో నిరంతరం ముందుంటూ సర్కారు దవాఖానను సూపర్ స్పెషాలిటీ స్థాయిలో తీర్చి దిద్దుతున్న ఎంఎల్‌ఏ కూనంనేని చొరవపై నియోజకవర్గ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పేద రోగులకు ప్రాణవాయువు లాంటి ఈ సౌకర్యాలను సాధించిన కూనంనేని సాంబశివరావు నాయకత్వంపై ప్రజలు ప్రజా సంఘాలు కార్మికులు సర్వత్ర ప్రశంసలు కురిపిస్తున్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ ఆదునిక ఐసియూ సేవల ద్వారా అత్యవసర విభాగంలో కార్పొరేట్ స్థాయి వైద్యం ప్రభుత్వ పరిధి లోనే అందించే అవకాశం కలుగుతుందని తెలిపారు. సామాన్య మధ్య తరగతి వర్గాల వారికి మెరుగైన వైద్య సేవలు కల్పించే దిశగా అస్పత్రి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని స్పష్టం చేశారు.



# మణుగూరు అనాథ బాలికల శరణాలయంలో సౌకర్యాలు ఏర్పాట్లు

**భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట**

**ప్రజాపక్షం/మణుగూరు:** మణుగూరు లోని బాలికల అనాధ శరణాలయంలో చిన్నారులకు ఇబ్బందులు కలగకుండా వారికి కావలసిన సౌకర్యాలు కల్పించడం జరిగిందని భద్రాచలం సబ్ కలెక్టర్ మృనాల్ శ్రేష్ట అన్నారు. ఈ నెల 20 తేదీ నాడు బాలికల అనాధ శరణాలయాన్ని ఆకస్మిక తనకి సమయంలో అక్కడ పిల్లలకు సరిపడా భోజన బల్లలు (డైనింగ్ మరియు కుర్చీలు లేవని, శరణాలయంలో కనీస వసతులను మెరుగుపరచడానికి మరికొన్ని ఫ్యాన్లు మరియు ట్యూబ్ లైట్లు అవసరమని గమనించానని, వెంటనే పరిగణనలోకి తీసుకొని అవసరమైన భోజన బల్లలు, కుర్చీలు, ఫ్యాన్లు మరియు ట్యూబ్ లైట్లను సాయంత్రం నాటికి ఏర్పాటు చేయాలని మణుగూరు తహాశీల్దార్ నరేష్‌ను ఆదేశించడం జరిగిందని, అదే రోజు పిల్లల ఇష్టానుసారం వారికి ప్రత్యేక విందును ఏర్పాటు చేయాలని కూడా ఆయన తహాశీల్దార్‌కు సూచించడం జరిగిందన్నారు. తక్షణమే స్పందించిన మణుగూరు తహాశీల్దార్ నరేష్ మరియు ఆయన బృందం, సాయంత్రం కల్లా అవసరమైన వసతులను మరియు ప్రత్యేక విందును ఏర్పాటు చేశారని అన్నారు. సమస్యలను ఆలస్యం లేకుండా పరిష్కరించడంలోనూ, పిల్లలకు అందుబాటులో ఉన్న వసతులను మెరుగుపరచడంలోనూ తహాశీల్దార్ మరియు ఆయన బృందం చూపిన అంకితభావం, తక్షణ స్పందన మరియు వేగవంతమైన చర్యలను పరిగణలోకి తీసుకొని వారిని అభినందించడం జరిగిందని అన్నారు. సబ్ కలెక్టర్ డివిజన్ పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకుల పాఠశాలలు, కళాశాలలు, హాస్టళ్ళ మరియు ఇతర ప్రభుత్వ సంస్థలలోని చిన్నవైనప్పటికీ ముఖ్యమైన సమస్యలను గుర్తించి, తక్షణమే పరిష్కరించేందుకు తమ పరిధిలో ఇదే తరహా చొరవ చూపాలని ఆయన ఇతర అధికారులను కోరారు. సకాలంలో జోక్యం చేసుకోవడం మరియు బాధ్యతాయుతమైన యంత్రాంగం ద్వారా పిల్లలు మరియు విద్యార్థుల సంక్షేమాన్ని, వసతులను మెరుగుపరచడంలో అర్థవంతమైన మార్పును తీసుకురావచ్చని ఆయన అన్నారు.



# ఘోర రోడ్డు ప్రమాదం

**-ట్రాక్టర్ ఢీకొని భర్త దుర్మరణం..**
**భార్యకు తీవ్ర గాయాలు**



**ప్రజాపక్షం/ములకలపల్లి:** ములకలపల్లి మండలంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ములకలపల్లి గ్రామానికి చెందిన మిర్యాల శంకర్రావు(55) తన భార్య పద్మతో కలిసి చాపరాలపల్లి వెళ్తుండగా వెనుక నుంచి వచ్చిన ట్రాక్టర్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ శంకర్రావు తలపై నుంచి వెళ్లడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. పద్మకు కాలికి తీవ్ర గాయమై పరిస్థితి విషమంగా ఉండటంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఎస్‌ఐ మధు ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## కామేపల్లిలో అధికారులు

# స్థానికంగా ఉండరా..?

**-ఏజెన్సీ అలవెన్సులు పొందుతూ అప్‌అండ్‌డౌన్..**
**-మండల సమస్యలు మకాం**

**ప్రజాపక్షం/కామేపల్లి:** కామేపల్లి మండలంలో పని చేస్తున్న పలు శాఖల అధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండకుండా పట్టణ ప్రాంతాల నుంచి రాకపోకలు సాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఏజెన్సీ అలవెన్సులు పొందుతున్నప్పటికీ స్థానికంగా మకాం ఉండకపోవడంతో ప్రజలకు ప్రభుత్వ సేవలు సకాలంలో అందడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులతో పాటు కొందరు సిబ్బంది సైతం అప్‌అండ్ డౌన్ చేస్తుండటంతో కార్యాలయాలకు వచ్చే విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటున్నారు. కొన్ని శాఖల్లో అధికారులు సమావేశాలు, పర్యటనల పేరుతో అందుబాటులో ఉండటం లేదనే విమర్శలు ఉన్నాయి. గ్రామాల్లో పంచాయితీ సిబ్బంది సక్రమంగా అందుబాటులో లేకపోవడంతో పారిశుద్ధ్య సమస్యలు పేరుకుపోతున్నాయని ప్రజలు చెబుతున్నారు. విధులు నిర్వహించే ప్రాంతంలోనే అధికారులు, సిబ్బంది నివాసం ఉండాల్సిన నిబంధనలు అమలయ్యేలా చూడాలని, ఏజెన్సీ అలవెన్సులు, గృహ అద్దె భత్యాల చెల్లింపులపై కూడా పరిశీలన జరపాలని కోరుతున్నారు.



**కలెక్టర్ చర్యలు తీసుకోవాలి....**

మండలంలోని అన్ని శాఖల అధికారులు, సిబ్బంది స్థానికంగా నివాసం ఉండేలా జిల్లా కలెక్టర్ చర్యలు తీసుకోవాలని, ప్రజలకు అధికారులు అందుబాటులో ఉండేలా పర్యవేక్షణ పెంచాలని కామేపల్లి మండల ప్రజలు కోరుతున్నారు.

# సిద్ది వెంకటేశ్వర్లు సేవలు చిరస్మరణీయం




**ప్రజాపక్షం/బూర్గంపాడు:** బూర్గంపాడు మండలం సారపాకలో సీపీఐ పట్టణ సమితి ఆధ్వర్యంలో సిద్ధి వెంకటేశ్వర్లు నాలుగో వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ముప్వ వెంకటేశ్వర్లు (లడ్డా) మాట్లాడుతూ పేదల ఇళ్లు, ఇళ్ల స్థలాలు, పోడు, భూ సమస్యలపై సిద్ధి వెంకటేశ్వర్లు చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. కార్యకర్తలకు అండగా నిలిచిన ఆయన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని తెలిపారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు పేరాల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ అధ్యక్షుడు ఎండి సాజిద్, ఏడో వార్డు సభ్యుడు జీ భీమా నాయక్, జహీర్, తదితరులు పాల్గొన్నారు.


# బత్తిని సత్యన్నకు విప్లవ జోహార్లు



**ప్రజాపక్షం/ఆళ్లపల్లి:** సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఇల్లందు డివిజన్ కమిటీ సభ్యుడు బత్తిని సత్యన్న అనారోగ్యంతో గురువారం రాత్రి మృతి చెందారు. శుక్రవారం ఆయన భౌతికకాయానికి న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు ఆవునూరి మధు, ఖమ్మం జిల్లా కార్యదర్శి బండారి ఐలయ్య, ఇల్లందు డివిజన్ కార్యదర్శి తుపాకుల నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల కార్యదర్శి బట్టు ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సంతాప సభలో నాయకులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసం సత్యన్న చేసిన సేవలు చిరస్మరణీయమని, క్రమ శిక్షణతో విప్లవోద్యమానికి ఆయన అందించిన సేవలు మరువలేనివన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. సీపీఐ జిల్లా నాయకుడు రేసు ఎల్లయ్య, గుండాల మాజీ ఎంపీపీ ముక్తి సత్యం, కాచనపల్లి సర్పంచ్ జరుపుల కిషన్ తదితరులు నివాళులర్పించారు. ప్రజా సంఘాల నాయకులు గౌని నాగేశ్వరరావు, జె సీతారామయ్య, కొక్కు సారంగపాణి, డి ప్రసాద్, పూనెం రంగయ్య, ఎండి రాసుద్దీన్, మెస్సు గోపాల్, కొమరం సత్యనారాయణ, అటికం శేఖర్, హర్ష, పొడుగు నరసింహారావు, ఎట్టి నరసింహారావు, యాసారపు వెంకన్న, పర్షిక రవి, గొగ్గెల గాదే రాజు, గొగ్గెల బొజ్జన్న, పూనెం లక్ష్మణ్, పూనెం మంగ, రాంబాబు, బుచ్చన్న, యనగంటి లాజర్, బొమ్మెర్ల వీరన్న, తదితరులు నివాళులర్పించారు.

# కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు ఎక్కడ..?

**-పార్టీ కార్యక్రమాల్లో కనిపించకపోవడంపై కార్యకర్తల్లో చర్చ**




**ప్రజాపక్షం/ఏన్కూరు :** ఏన్కూరు కాంగ్రెస్ మండల అధ్యక్షురాలు స్వర్ణ శిరీష పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండటంపై కార్యకర్తల్లో చర్చ జరుగుతోంది. రెండు నెలల క్రితం ఎంఎల్‌ఏ మాలోత్ రాందాస్ నాయక్ ఆధ్వర్యంలో జిల్లా పార్టీ అధ్యక్షులు మండల కమిటీలను ప్రకటించగా, ఏన్కూరు అధ్యక్షురాలిగా స్వర్ణ శిరీషను నియమించారు. అయితే బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి పార్టీ, ఎంఎల్‌ఏ కార్యక్రమాల్లో ఆమె కనిపించకపోవడంతో మండల అధ్యక్షురాలు ఉన్నారా? లేదా? అన్న గుసగుసలు వినిపిస్తున్నాయి. గతంలో మండల అధ్యక్షుడిగా పని చేసిన స్వర్ణ నరేందర్ కొనసాగుతున్నారన్న ప్రచారం కూడా పార్టీలో చర్చనీయాంశమైంది.

# డిప్లొమా విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలి



**ప్రజాపక్షం/కారేపల్లి:** డిప్లొమా విద్యార్థులను బీటెక్ విద్యకు దూరం చేసే జీవో నెంబర్ 97ను వెంటనే ఉపసంహరించాలని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ దిశా కమిటీ సభ్యుడు లకావత్ లక్ష్మణ్ డిమాండ్ చేశారు. సింగరేణి మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ జీవో 97తో డిప్లొమా విద్యార్థులకు ఉన్నత విద్యా అవకాశాలు దెబ్బతింటాయని అన్నారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే విద్యార్థులతో కలిసి పెద్ద పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని హెచ్చరించారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో విద్య, సాంకేతిక రం గాలకు ప్రాధాన్యం ఇచ్చామని, యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు కృషి చేశామ ని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు.

# ఆశ్రమ పాఠశాలలో నూతన బోరు ప్రారంభం



**ప్రజాపక్షం/ములకలపల్లి:** కమలాపురం గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన నూతన బోర్‌వెల్‌ను శుక్రవారం ఎంఎల్‌ఏ జారె ఆదినారాయణతో కలిసి సర్పంచ్ వగ్గేల రాధ ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. పాఠశాలల్లో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎంఎల్‌ఏ దృష్టికి సర్పంచ్ తీసుకెళ్లారు. గ్రామ పంచాయితీ అభివృద్ధికి ప్రభుత్వ నిధులు కేటాయించాలని, సీసీ రోడ్లు, డ్రైనేజీ తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈకార్యక్రమంలో కుంజా రాంమూర్తి, గొగ్గల ఆదినారాయణ, పెటేటి నర్సింహారావు, ప్రభాకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# అర్హత గల ఓటరు పేరు తుది జాబితాలో ఉండాలి : కలెక్టర్

ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : ఎస్ఐఆర్ 2026 ప్రక్రియలో ప్రతి అర్హత గల ఓటరు పేరును తుది జాబితాలో కొనసాగించడమే లక్ష్యంగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిపిఎస్ తెలిపారు. ఎస్ఐఆర్ 2026పై ఈఆర్‌వోలు, ఏఈఆర్‌వో, బిఎల్‌వో, సూపర్ వైజర్లతో కలెక్టర్ దివాకర టిపిఎస్ శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత మూడు, నాలుగు నెలలుగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది సమష్టిగా కృషి చేయడం వల్ల ఖమ్మంజిల్లాలో అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు చాలా తక్కువగా ఉన్నాయన్నారు. ఇతర జిల్లాల్లో ఒక్కో నియోజక వర్గంలో 50వేల వరకు అనామలీస్, నో మ్యాపింగ్ కేసులు నమోద య్యాయన్నారు. ప్రస్తుతం రెండు ప్రధాన అంశాలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. మొదటిది అనామలీస్, నో మ్యాపింగ్ కేసులకు నోటీసులు జారీ చేయడం, రెండవది రెండు నెలల్లో క్లెయిమ్స్, అభ్యంతరాలను స్వీకరించి పరిష్కరించాలన్నారు. సర్ ప్రక్రియపై ప్రతి అధికారి, సిబ్బందికి క్షేత్రస్థాయిలో పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి నోటీసులో విచారణ తేదీ, విచారణ జరిగే ప్రదేశం, సమయం స్పష్టంగా పేర్కొనాలన్నారు. నోటీసు అందజేసిన ప్రతి విషయాన్ని బిఎల్‌వో యాప్‌లో ఫోటోతో సహా నమోదు చేయాలన్నారు. విచారణకు సంబంధించిన వివరాలతో పాటు ఓటర్లు సమర్పించిన ఆధారాలను కూడా యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. నోటీసులు జారీ చేసే సమయంలో ఓటర్ల వద్ద 11 రకాల ధృవ పత్రాల్లో ఏమైనా ఉన్నాయా అనే విషయాన్ని పరిశీలించాలన్నారు. ధృవ పత్రాలు లేని అర్హులైన ఓటర్లకు కుల ధృవపత్రం జారీ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సర్ ప్రక్రియలో ప్రజాప్రతినిధులు బిఎల్ఏలను భాగస్వామ్యం చేసి నోటీసులు, విచారణ ప్రక్రియపై వారికి అవగాహన కల్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు తుది జాబితాలో ఉండేలా అధికారులు కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో ఖమ్మం కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్, ఎస్‌డిసి సదానందం, ఖమ్మం ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఎన్నికల విభాగం డిటి అన్సారీ, ఏఈఆర్‌వోలు, మున్సిపల్ కమిషనర్లు, బిఎల్‌వోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.



# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్యకు నిరసనగా ఖమ్మంలో ర్యాలీ

ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ : నల్లగొండ జిల్లాలోని నాగార్జున పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ రూపారెడ్డి దారుణ హత్యను నిరసిస్తూ తెలంగాణ రికగ్నైజ్డ్ ప్రైవేట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రస్మా) ఖమ్మం శాఖ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలో భారీ ర్యాలీ నిర్వహించారు. శుక్రవారం ఖమ్మం నగరంలో నిర్వహించిన ఈ ర్యాలీని ఫేమా కన్వీనర్ ముప్పా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న గురువులపై దాడులు, హత్యలు జరగడం విద్యా వ్యవస్థ మనుగడకే ప్రమాదకరమన్నారు. ఇలాంటి పరిస్థితులు కొనసాగితే ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడం కష్టతరమవుతుందన్నారు. ఉపాధ్యాయులు, విద్యా సంస్థల రక్షణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దిష్ట చట్టాలు, కార్యాచరణ ప్రణాళికలు తీసుకొని రావాలని డిమాండ్ చేశారు. జెఎన్‌టియు పాలక మండలి సభ్యులు కాటేపల్లి నవీన్‌బాబు, జూనియర్ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షులు చల్లా శేషగిరి పాల్గొని సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షులు గుర్రం కాంతారావు, కార్యదర్శి నాయుడు వెంకటేశ్వరరావు, కోశాధికారి యెలిశెట్టి నాసరయ్య, రాష్ట్ర నాయకులు కేసా వీరన్న, ఐవి రమణారావు, పి. రవిమారుత్, కొండపల్లి శశిధర్‌రెడ్డి, కోటగిరి ప్రవీణ్, కందుల శంకరయ్య, ఇస్మాయిల్, అంజన్‌బాబు, జిల్లా నాయకులు రవికుమార్, అజారుద్దీన్, వెంకటేశ్వర రావు, ఉమాశంకర్, నారాయణరావు, నాగార్జున, మహేష్, శ్రీనివాస రావు, సౌభాగ్య, హుస్సేన్, శ్రీవిద్య, ఖమ్మం డివిజన్ ట్రస్మా నాయకులు జాఫర్, మథిన్, హరిబాబు, మోహన్‌రెడ్డి, టివి అప్పారావు, కార్తీక్, కృష్ణ చైతన్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు : ఎస్‌పి

ప్రజాపక్షం/ అశ్వారావుపేట : వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్ అశ్వారావుపేట పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా పాల్వంచ డిఎస్పీ ఆర్.సతీష్‌కుమార్ జిల్లా ఎస్పీకి స్వాగతం పలికారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నుంచి జిల్లా ఎస్పీ గౌరవ దనం స్వీకరించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించే సిబ్బంది ప్రభుత్వ కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్‌స్టేషన్‌ను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వివిధ సమస్యలతో పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరిస్తూ వారి సమస్యలకు సత్వర న్యాయం అందేలా ప్రతిఒక్కరూ బాధ్యతగా విధులు నిర్వర్తించాలని తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో వివిధ వర్టికల్స్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పనితీరును ఒక్కొక్కరిగా అడిగి తెలుసుకున్నారు. పేకాట, కోడిపందాలు, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై నిరంతరం నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన దొంగతనం కేసుల వివరాలు అడిగి తెలుసుకుని పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు, దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి అరెస్ట్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పీ ఆర్.సతీష్‌కుమార్, సిఐ నాగరాజు, ఎస్సైలు యయాతి రాజు, రాజేష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



# చోరీ కేసుల్లో నిందితుడి అరెస్టు

-రూ. 2.10 లక్షల విలువైన బంగారు ఆభరణాలు స్వాధీనం

ప్రజాపక్షం/తల్లాడ : తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రెండు చోరీ కేసుల్లో నిందితుడిని అరెస్టు చేసి చోరీకి గురైన బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు వైరా సిఐ వెంకటప్రసాద్ శుక్రవారం తెలిపారు. రెండు ఇండ్ల చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న జంగాల స్వరూప్‌కుమార్ అలియాస్ వినయ్ కుమార్‌ను ఉదయం తల్లాడ బస్టాండ్ వద్ద శుక్రవారం అరెస్టు చేసినట్లు సిఐ తెలిపారు. ఏప్రిల్ 11న గంగదేవిపాడు గ్రామానికి చెందిన సిలివేరు నర్సింహారావు పని మీద బయటకు వెళ్లగా ఆయన భార్య కూలీ పనికి వెళ్లారు. మధ్యాహ్నం ఇంటికి తిరిగి వచ్చిన నర్సింహారావు ఇంటికి వేసిన తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించాడు. ఇంట్లోని ఇనుప బీరువాను కూడా పగలగొట్టి అందులో భద్రపరిచిన బంగారు ఆభరణాలు చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తులో భాగంగా నిందితున్ని గుర్తించి అదుపులోకి తీసుకుని విచారించగా గంగదేవిపాడు గ్రామంలో తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి తాళం పగలగొట్టి ఇంట్లోకి ప్రవేశించి ఇనుప బీరువాను పగలగొట్టి బంగారు ఆభరణాలను చోరీ చేసినట్లు వెల్లడించాడు. అదేవిధంగా తల్లాడ ఎస్ఐ ఎన్. వెంకటకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన విచారణలో తల్లాడ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో నిందితుడు తాళం వేసి ఉన్న ఇంటిని గుర్తించి తాళం పగలగొట్టి రెండు బంగారు ఉంగరాలను చోరీ చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు. అనంతరం ఆ బంగారు ఉంగరాలను గన్నవరం ప్రాంతంలో ఎస్ఆర్ బంగారు దుకాణంలో విక్రయించినట్లు విచారణలో తెలిపారన్నారు. దర్యాప్తులో నిందితుడికి గతంలో కూడా పలు చోరీ, ఇంటి దొంగతనం కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామన్నారు. వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో అతనిపై నమోదైన పాత కేసుల వివరాలను సంబంధిత పోలీస్ రికార్డుల ద్వారా పరిశీలించినట్లు తెలిపారు. నిందితుడి ప్రమేయం ఉన్న ఇతర ఆస్తి నేరాలను కూడా గుర్తించేందుకు దర్యాప్తు కొనసాగుతుందన్నారు. స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలను సాక్షుల సమక్షంలో చట్టపరమైన విధానంలో స్వాధీనం చేసుకుని నిందితుడిని అరెస్టు చేసి వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. ప్రజలు ఇండ్లకు తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో విలువైన వస్తువులను ఇంట్లో బహిరంగంగా ఉంచకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాళం వేసి బయటకు వెళ్లే సమయంలో పొరుగు వారికి సమాచారం ఇవ్వడం, అనుమానాస్పద వ్యక్తులు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించడం ద్వారా చోరీలను నివారించవచ్చునని తెలిపారు.



# వైరా గురుకుల బాలికల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లు

ప్రజాపక్షం/వైరా: వైరాలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాల బాలికల విభాగంలో 5,7,8,9 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఆగస్ట్22వ స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డి.సమత తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థినిలు ఆగస్ట్22న ఉదయం 10.30 గంటలకు ఖమ్మంలో నిర్వహించనున్న వైరా బాలికల గురుకుల పాఠశాల, కళాశాలకు అవసరమైన అని ధృవపత్రాలతో హాజరు కావాలని ఆమె సూచించారు. ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి అర్హత ఉన్న విద్యార్థినిలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సత్యానందం కుటుంబానికి ఆర్థిక చేయూత

ప్రజాపక్షం/బోనకల్ : రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన రిపోర్టర్ మంద సత్యానందం కుటుంబానికి మిత్రులు, దాతలు అండగా నిలిచారు. యూటీఎఫ్ జిల్లా కోశాధికారి వల్లకొండ రాంబాబు ఆధ్వర్యంలో సుమారు 200 మంది నుంచి సేకరించిన రూ.4.52 లక్షలను సత్యానందం ముగ్గురు పిల్లల పేర్లపై ఫిక్స్‌డ్ డిపాజిట్ చేశారు. శుక్రవారం లక్ష్మీపురం సొసైటీలో ఎఫ్‌డి బాండ్లను సొసైటీ ఛైర్మన్ మాదినేని వీరభద్రరావు, సర్పంచ్ మంద కరుణ, ఉపసర్పంచ్ కారంగుల చంద్రయ్య, వల్లకొండ రాంబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. పిల్లల భవిష్యత్, చదువులకు మొత్తం ఉపయోగపడేలా ఎఫ్‌డి చేసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వల్లకొండ సురేష్, కొమ్ము శ్రీనివాసరావు, ఇరుగు జానేష్, తమ్మారపు లక్ష్మణరావు, పసుపులేటి వెంకటేశ్వర్లు, ఎర్రబోయిన అప్పారావు, నల్లమోతు నాగేశ్వరావు, ముత్తారపు రవి, మంద జాన్, కళ్యాణపు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



# తాగునీటి సరఫరాను పరిశీలించిన కలెక్టర్

ప్రజాపక్షం/కల్లూరు: కల్లూరు మండల పరిధిలోని పలు ప్రాంతాలలో కాలువ ద్వారా నీటి సరఫరాను కలెక్టర్ దివాకర్ శుక్రవారం ప్రత్యక్షంగా కాలువ కట్టలపై ద్విచక్ర వాహనంపై తిరుగుతూ తెలంగాణ ఆంధ్ర సరిహద్దు వరకు ప్రత్యక్షంగా నేరుగా వెళ్లి పరిశీలించారు. మండలంలోని దారుక బంజర్, చిన్న కోరుకొండి, మర్లపాడు, పుణ్య పురం, మేజర్ పాయపూరు వద్ద, కల్లూరు లోని కప్పల బంధం రెగ్యులేటర్ వద్ద నేరుగా నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి పర్యవేక్షించారు. నీటిని వృధా చేయవద్దని అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని తమ సిబ్బంది కి సూచించారు. ఎస్ ఈ శ్రీకాంత్, డి ఈ రాజరత్నాకర్, లతోపాటు సి ఈ వాసంతి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



# జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీగా రామారావు

ప్రజాపక్షం/తల్లాడ : తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామానికి చెందిన ఆపది వెంకట రామారావుకు జిల్లా కిసాన్ మోర్చా జనరల్ సెక్రటరీ పదవి లభించింది. మూడు దశాబ్దాలకు పైగా పార్టీలో ఉంటూ పార్టీని విస్తరించడంలో తన వంతు బాధ్యత నిర్వహించినందుకు గాను రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు, జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు లు వ్యవసాయంపై మంచి పట్టు ఉన్న రామారావుకు ఈ పదవి అందించారు. బాబ్రీ మసీదు అంశంలో ఆ రోజుల్లోనే 120 మందిని కరసేవకులను వెంట పెట్టుకుని బాబ్రీ మసీదు వద్దకు రామారావు ఆధ్వర్యంలో వెళ్లారు. పార్టీ ఫుల్ టైమర్‌గా ఎనిమిది సంవత్సరాలుగా పార్టీ కార్యాలయానికి రామారావు అంకితమైనారు. తల్లాడ మండల అధ్యక్షులుగా రెండు దఫాలుగా ఆయన పనిచేశారు. ఆయనకు జిల్లా స్థాయిలో ఈ పదవి రావడానికి తోడ్పాటు అందించిన రాష్ట్ర నాయకులు పొంగులేటి సుధాకర్‌రెడ్డికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. తనపై నమ్మకం ఉంచిన జిల్లా అధ్యక్షులు నెల్లూరు కోటేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



# కాంగ్రెస్ పార్టీ బలోపేతమే లక్ష్యం

ప్రజాపక్షం/తల్లాడ : ఖమ్మం జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు, మండల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. మండల కమిటీలు, గ్రామ కమిటీల ఏర్పాటు, పార్టీ సంస్థాగత బలోపేతమే ఈ సమావేశ ముఖ్య ఉద్దేశంగా కొనసాగింది. ఈ సందర్భంగా తల్లాడ మండల కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మూడుముంతల గంగరాజు, పమ్మి అశోక్ ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగునూరి లక్ష్మారెడ్డి చేతుల మీదుగా సిద్ధం చేసిన మండల కమిటీలను జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్‌కి అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని గ్రామస్థాయి నుంచి మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా మండల, గ్రామ కమిటీలను సమర్థవంతంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రతి గ్రామంలో పార్టీ కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని సూచించారు.



# కూనంనేనిని కలిసిన కౌన్సిలర్ నల్లమోతు శైలజ

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ 15వ వార్డు కౌన్సిలర్ నల్లమోతు శైలజ సురేష్ దంపతులను శుక్రవారం సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 15వ వార్డులో నెలకొన్న పరిస్థితులు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వివరించారు. వార్డులోని సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని వారు కోరారు.



# రూ.12 కోట్లతో పోస్టాఫీస్‌-హేమచంద్రాపురం రోడ్డు పనులు

**- కూనంనేని చొరవతో రోడ్డు అభివృద్ధికి మోక్షం**
**- త్వరలో ప్రారంభంకానున్న డబుల్‌ రోడ్డు పనులు**
**- సింగరేణి పరిధిలో టెండర్లు పూర్తి**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : నియోజకవర్గ పరిధిలోని పోస్టాఫీస్‌ సెంటర్‌ నుండి శేషగిరి నగర్‌ మీదుగా హేమచంద్రాపురం వరకు రూ.12 కోట్ల వ్యయంతో చేపట్టనున్న రోడ్డు వెడల్పు, డబుల్‌ రోడ్డు నిర్మాణ పనులకు టెండర్‌ ప్రక్రియ విజయవంతంగా పూర్తయింది. ఈ మార్గంలో సింగరేణి భారీ వాహనాల రాకపోకల కారణంగా రోడ్డు తీవ్రంగా ధ్వంసమై ప్రయాణికులు స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్య తీవ్రతను గుర్తించిన స్థానిక ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు ప్రజల రవాణా కష్టాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రత్యేక చొరవ తీసుకున్నారు. రోడ్డు పునఃనిర్మాణం చేపట్టాలని సింగరేణి ఉన్నతాధికారులతో ఆయన పలుమార్లు ప్రత్యేకంగా సమావేశమై పనుల ఆవశ్యకతపై తీవ్ర స్థాయిలో ఒత్తిడి తీసుకొచ్చారు. ఎంఎల్‌ఏ కూనంనేని చేసిన నిరంతర కృషి పట్టుదలకు సింగరేణి యాజమాన్యం సానుకూలంగా స్పందించి తక్షణమే నిధులు మంజూరు చేసింది. ఈ నిధులతో పనుల నిర్వహణకు సంబంధించిన టెండర్ల ప్రక్రియను ఇప్పటికే సింగరేణి అధికారులు పూర్తి చేశారు. అన్ని అనుమతులు పూర్తి కావడంతో త్వరలోనే ఈ ప్రతిష్టాత్మక డబుల్‌ రోడ్డు నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో ప్రారంభించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే పోస్టాఫీస్‌ సెంటర్‌ నుండి హేమచంద్రాపురం వరకు రాకపోకలు సాగించే వాహనాలకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. రవాణా రద్దీ తగ్గడంతో పాటు స్థానిక ప్రాంతాల ప్రజలకు శాశ్వత దుమ్ము గుంతల సమస్యల నుంచి పూర్తి విముక్తి లభిస్తుంది. ప్రజా సమస్యల పరిష్కారంలో చిత్తశుద్ధితో వ్యవహరిస్తూ అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న ఎంఎల్‌ఏ పనితీరుపై స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యమిస్తూ ఎంఎల్‌ఏ చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఈ రోడ్డు నిర్మాణం మరో నిదర్శనంగా నిలుస్తోంది. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ త్వరలోనే పనులను ప్రారంభిస్తామని, నిర్ణీత గడువులోగా నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేసేలా ప్రత్యేక చొరవ తీసుకుంటామని తెలిపారు.

# కార్మికుడిని మేయర్‌ చేయడం కమ్యూనిస్టులకే సాధ్యం

**- ఏపీ రాష్ట్ర మహాసభల్లో మేయర్‌ మూడ్‌ గణేష్‌**




ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : విశాఖపట్నంలోని పబ్లిక్‌ లైబ్రరీ హాల్‌ నందు గురు, శుక్రవారాల్లో ఆంధ్రప్రదేశ్‌ ఆటో అండ్‌ మోటార్‌ ట్రాన్స్‌పోర్ట్‌ వర్కర్స్‌ యూనియన్‌ (ఏఐటీయూసీ) రాష్ట్ర నాల్గవ సహాసభలు ఘనంగా జరిగాయి. ఈ మహాసభలకు ఆహ్వాన సంఘం పిలుపు మేరకు కొత్తగూడెం మున్సిపల్‌ కార్పోరేషన్‌ మేయర్‌ మూడ్‌ గణేష్‌ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. గతంలో తాను స్వయంగా ఆటో కార్మికుడిగా పనిచేసిన విషయాన్ని ఈ సందర్భంగా ఆయన సభలో గుర్తుచేసుకున్నారు. క్షేత్రస్థాయిలో రవాణా రంగ కార్మికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, కష్టనష్టాలు తనకు పూర్తిగా తెలుసునని ఆయన పేర్కొన్నారు. ఒక సాధారణ ఆటో కార్మికుడి స్థాయి నుంచి కార్పోరేషన్‌ మేయర్‌గా అవకాశం కల్పించడం కేవలం కమ్యూనిస్టు పార్టీలకే సాధ్యమని స్పష్టం చేశారు. శ్రమజీవులను గుర్తించి ప్రజాప్రతినిధులుగా చట్టసభలకు, స్థానిక సంస్థలకు పంపే ఘనత ఎర్రజెండాకే దక్కుతుందని ఆయన కొనియాడారు. రవాణా రంగ కార్మికుల సంక్షేమం, భద్రత కోసం ప్రభుత్వాలు పటిష్టమైన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని పిలుపునిచ్చారు. మోటార్‌ కార్మికుల హక్కుల సాధనకు ఏఐటీయూసీ చేస్తున్న పోరాటాలు అభినందనీయమని, భవిష్యత్తులోనూ ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు. అసంఘటిత రంగ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం యూనియన్లు నిరంతరం ప్రజల్లో ఉంటూ గళం విప్పాలని సూచించారు. కార్మికుల పక్షాన నిలిచే నాయకులకు సమాజంలో ఎల్లప్పుడూ సముచిత స్థానం, ఆదరణ లభిస్తాయని ఈ సందర్భంగా వివరించారు. కార్మిక వర్గాల సంక్షేమానికి తన వంతు సహకారం ఎల్లవేళలా కొనసాగుతుందని మేయర్‌ మూడ్‌ గణేష్‌ హామీ ఇచ్చారు.

# పాలిటెక్నిక్‌ విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దు

**- ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌**



ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం : పాలిటెక్నిక్‌ కళాశాలలను యంగ్‌ ఇండియా స్కిల్‌ యూనివర్సిటీకి అనుసంధానం చేసి విద్యార్థుల జీవితాలతో పాలకులు ఆడుకోవడం సరైంది కాదని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా సహాయ కార్యదర్శి మాణిక్యాల వినయ్‌ డిమాండ్‌ చేశారు. శుక్రవారం పాలిటెక్నిక్‌ కళాశాల వద్ద ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వినయ్‌ మాట్లాడుతూ పాలిటెక్నిక్‌ విద్యార్థులు జీవితాలను తీర్చి దిద్దే లాటరల్‌ ఎంట్రీ విధానం రద్దు చేస్తే వారి భవిష్యత్‌ అంధకారంలో పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నూతన విద్యావిధానం పేరుతో విద్యార్థుల జీవితాలతో ఆటలాడటం ఎంత వరకు సరైందని ప్రశ్నించారు. యంగ్‌ ఇండియా స్కిల్‌ యూనివర్సిటీ పేరుతో సాంకేతిక విద్యను ప్రైవేటీకరించే ప్రయత్నాలు ఇప్పటికైనా విరమించుకోవాలన్నారు. పాలిటెక్నిక్‌, ఐటిఐ కళాశాలలను ప్రైవేటు శక్తులకు అప్పగించే చర్యలు విద్యార్థుల భవిష్యత్‌ను ప్రశ్నార్థకం చేస్తాయన్నారు. పాలిటెక్నిక్‌ విద్యద్వారా ఎంతో మంది విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదిగారని, ఈ విద్యావ్యవస్థను నిర్వీర్యం చేయడం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య ఉద్యోగ అవకాశాలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. లాటరల్‌ ఎంట్రీ విధానాన్ని కొనసాగించాలని, పాలిటెక్నిక్‌ విద్యను బలోపేతం చేయాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొరిమి సంజయ్‌ పాలిటెక్నిక్‌ కమిటి సభ్యులు సలిగంటి జయదీప్‌ రామ్‌చరణ్‌ సాయిరామ్‌ వడ్డెబోయిన యశ్వంత్‌ సన్ని స్నేహిత్‌ తదితరులు పాల్గొన్నారు.

# వృద్ధుల సంరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత

**- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్‌**



ప్రజాపక్షం/మంచుపల్లి: ప్రపంచ సీనియర్‌ సిటిజన్స్‌ డే సందర్భంగా హేమచంద్రాపురం గ్రామంలోని అమ్మా అనాథాశ్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, భద్రాద్రి కొత్తగూడెం ఆధ్వర్యంలో శుక్రవారం సీనియర్‌ సిటిజన్స్‌కు న్యాయ అవగాహన కార్యక్రమంతోపాటు ఉచిత వైద్య ఆరోగ్య పరీక్షల శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్‌ సిటిజన్స్‌కు కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి వైద్య సలహాలు, మందులు అందించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది సహకారంతో వైద్య శిబిరం నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ఎం.రాజేందర్‌ మాట్లాడుతూ సీనియర్‌ సిటిజన్స్‌ సమాజానికి అందించిన సేవలు, వారి అనుభవం ఎంతో విలువైనవని అన్నారు. వృద్ధుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ప్రేమ, బాధ్యతతో వ్యవహరించాలని సూచించారు. సీనియర్‌ సిటిజన్స్‌ తమ హక్కులను తెలుసుకోవడంతోపాటు అవసరమైనప్పుడు అందుబాటులో ఉన్న న్యాయ సహాయాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. వృద్ధుల సంరక్షణ, భద్రత, గౌరవప్రదమైన జీవనం కోసం చట్టపరమైన రక్షణలు ఉన్నాయని, అర్హులకు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ద్వారా ఉచిత న్యాయ సహాయం అందుబాటులో ఉంటుందని వివరించారు. అనంతరం డీఎంహెచ్‌ఓ డా॥ తుకారామ్‌ రాథోడ్‌ మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరమన్నారు. సీనియర్‌ సిటిజన్స్‌ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, కంటి చూపు, రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలను నిర్లక్ష్యం చేయకూడదని సూచించారు. సరైన ఆహారం, ఆరోగ్యకరమైన జీవనశైలి, వైద్యుల సూచనలు పాటించడం ద్వారా వృద్ధాప్యంలోనూ ఆరోగ్యంగా జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు డా. దీపిక, తిరుమలరావు, స్వప్న, శ్రావణి, లక్ష్మి, ఏఎన్‌ఎంలు, ల్యాబ్‌ టెక్నీషియన్లు, న్యాయవాది మెండు రాజమల్లు, హ్యూమన్‌ రైట్స్‌ ఫౌండేషన్‌ అధ్యక్షుడు సుధాకర్‌ రావు, అమ్మానాథాశ్రమం నిర్వాహకులు హిమ తేజ తదితరులు పాల్గొన్నారు.

# విద్యుత్‌ సమస్యలు పరిష్కరించాలి

ప్రజాపక్షం/ఇల్లందు: ఇల్లందు, గుండాల, ఆళ్లపల్లి మండలాల్లో విద్యుత్‌ సమస్యలు పరిష్కరించాలని విద్యుత్‌ వినియోగదారుల సేవా సదస్సులో సీపీఎం నాయకులు అధికారులను కోరారు. ఇల్లందు ఈఆర్‌ఓ కార్యాలయంలో జరిగిన సదస్సులో సీపీఎం జిల్లా నేత అబ్దుల్‌ నబీ, మండల కార్యదర్శి ఆలేటి కిరణ్‌ కుమార్‌, మన్యం మోహన్‌రావు పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దేవులపల్లి యాకయ్యనగర్‌లో ఎనిమిదేళ్లుగా విద్యుత్‌ లేక ఇబ్బందులు పడుతున్న పేదలకు కనెక్షన్లు ఇవ్వాలని, 21 పిట్‌ తిలక్‌నగర్‌లో విద్యుత్‌ ప్రమాదంలో మృతి చెందిన బాలుడి కుటుంబానికి పరిహారం అందించాలని కోరారు. లాల్‌మహ్మద్‌లో సింగిల్‌ వైర్‌ తొలగించి త్రీ ఫేజ్‌ సరఫరా, పెద్ద ట్రాన్స్‌ఫార్మర్‌, అవసరమైన చోట కొత్త విద్యుత్‌ స్తంభాలు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిష్కరిస్తామని విద్యుత్‌ సంస్థ కొత్తగూడెం ఎస్‌ఈ హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో విద్యుత్‌ అధికారులు, ప్రజలు, పాత్రికేయులు, సీపీఎం నాయకులు గద్దం వెంకన్న, వైకుంఠం, హసీనా, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీరామయ్య కుంటలో విషాదం

**-ఈతకు వెళ్లి యువకుడి మృతి**



ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: మండలంలోని పెంట్లం గ్రామ శివారులో ఉన్న శ్రీరామయ్య కుంటలో ఈతకు వెళ్లిన ఇనుపనూరి సంతోష్‌(35) నీటిలో మునిగి మృతి చెందాడు. ఈఘటనతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానికుల వివరా ప్రకారం పెంట్లం గ్రామానికి చెందిన సంతోష్‌ శ్రీరామయ్య కుంటకు ఈతకు వెళ్లాడు. ఈక్రమంలో ప్రమాదవశాత్తు నీటిలో మునిగిపోయి మృతి చెందినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు సంతోష్‌కు భార్యతో పాటు ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. వృత్తిపరంగా తాపీ మేస్త్రీ కుటుంబానికి ఆధారంగా ఉన్న సంతోష్‌ ఆకస్మికంగా మృతి చెందడంతో భార్య, పిల్లలు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఆయన మృతితో గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి ఉదయాన్నే పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

# పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు



ప్రజాపక్షం/అశ్వాపురం: అశ్వాపురం, మొండికుంట గ్రామాల్లో పత్తి, వరి, బంతి పంటలను కృషి విజ్ఞాన కేంద్రం భద్రాద్రి కొత్తగూడెం సీనియర్‌ శాస్త్రవేత్త, హెచ్‌ డాక్టర్‌ టి భరత్‌, వ్యవసాయ అధికారి ఎన్‌ఎంసి చటర్జీతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పంటల్లో చీడపీడల పరిస్థితిని పరిశీలించి రైతులకు సూచనలు చేశారు. వరిలో 40 నుంచి 45 రోజుల ముదురు నారు నాటడం వల్ల ఉల్లికోడు వంటి చీడపీడల ఉధృతి పెరిగే అవకాశం ఉందని, అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పత్తిలో రసం పీల్చే పురుగులతో పాటు వర్షాభావ పరిస్థితులను గుర్తించారు. పంటలో తేమను కాపాడుకోవడంతో పాటు, వ్యవసాయ శాఖ సూచనల మేరకే సిఫార్సు చేసిన మందులను వినియోగించాలని తెలిపారు. నీటి లభ్యత తక్కువగా ఉన్న పరిస్థితుల్లో వరికి బదులుగా అపరాల పంటలను సాగు చేయడం ద్వారా నీటి వినియోగాన్ని తగ్గించుకోవచ్చని డాక్టర్‌ భరత్‌ సూచించారు. పంటలను నిరంతరం పరిశీలిస్తూ శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారుల సలహాలు తీసుకోవాలని రైతులకు సూచించారు. ఈకార్యక్రమంలో ఉప సర్పంచ్‌ హర్ష, రైతులు పాల్గొన్నారు.

# రైతు కూలీల జాతీయ మహాసభలను జయప్రదం చేయండి




ప్రజాపక్షం/కారేపల్లి: సెప్టెంబర్‌ 28న ఖమ్మంలో నిర్వహించే అఖిల భారత రైతుకూలీ సంఘం(ఏఐకేఎంఎస్‌)భారీ బహిరంగ సభను, 29,30 తేదీల్లో జరిగే జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వై ప్రకాష్‌ పిలుపునిచ్చారు. ఖమ్మం లెనిన్‌నగర్‌లో సీపీఐ ఎంఎల్‌ న్యూడెమోక్రసీ కార్యాలయంలో జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షుడు బజ్జూరి వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా వై ప్రకాష్‌ మాట్లాడుతూ కేంద్రం ప్రకటించిన పంటల మద్దతు ధరలు రైతులకు గిట్టుబాటు కావడం లేదన్నారు. వాణిజ్య ఒప్పందాలను రద్దు చేసి, రైతు ప్రయోజనాలకు అనుగుణంగా విధానాలు రూపొందించాలని డిమాండ్‌ చేశారు. సెప్టెంబర్‌ 8,9తేదీల్లో మంచిర్యాలలో తెలంగాణ రాష్ట్ర మహాసభలు, 28 నుంచి 30వరకు ఖమ్మంలో జాతీయ మహాసభలు జరుగుతాయని తెలిపారు. రైతు కూలీల సమస్యలపై భవిష్యత్‌ ఉద్యమాలకు కార్యాచరణ రూపొందించనున్నట్లు పేర్కొన్నారు. సభలను జయప్రదం చేయాలని రైతు కూలీలకు పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో మండల రాజేంద్రప్రసాద్‌, ఎం గిరి, ఎస్‌కె కాసిం, లింగన్న, మురళి, అప్పారావు, శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా మోహన్‌రావు



ప్రజాపక్షం/బూర్గంపాడు: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు మహంకాళి రామారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో బూర్గంపాడు మండల ఉప సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడిగా బి మోహన్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గంలో ఉపాధ్యక్షుడు తోటమల్ల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి అప్పిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఆర్గనైజింగ్‌ సెక్రటరీ పాదెం సుధాకర్‌, కోశాధికారి పండగ సౌజన్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉప సర్పంచ్‌ల ఐక్యత, హక్కుల సాధన, గ్రామాల అభివృద్ధికి నూతన కార్యవర్గం కృషి చేయాలని నాయకులు ఆకాంక్షించారు. ఈకార్యక్రమంలో కన్నెదారి రమేష్‌, మోడెం రాధాకృష్ణ, కేశవపల్లి బేబీ, సున్నం కృష్ణవేణి, సీహెచ్‌ కుమారి తదితరులు పాల్గొన్నారు.

# నిస్వార్థ కమ్యూనిస్టు సిద్ధి : బాగం

**ప్రజాపక్షం/ఖమ్మం :** విద్యార్థి దశ నుంచి తుది శ్వాస వరకు కమ్యూనిస్టు ఉద్యమంలో వివిధ స్థాయిల్లో పనిచేసిన సిద్ధి వెంకటేశ్వర్లు నిస్వార్థ కమ్యూనిస్టు అని సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు తెలిపారు. శుక్రవారం సిద్ధి వెంకటేశ్వర్లు వర్ధంతి సందర్భంగా స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాగం హేమంతరావు మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణంలో సిద్ధి చురుకుగా వ్యవహరించారని విద్యార్థి, యువజన నాయకునిగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర బాధ్యతలతో సిపిఐ రాష్ట్ర సహయ కార్యదర్శిగా పనిచేశారన్నారు. పార్టీ నిర్మాణం, విస్తృతే లక్ష్యంగా సిద్ధి పనిచేశారని ఆయన తెలిపారు. సిద్ధి చూపిన మార్గాన్ని అనుసరించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్, సహాయ




కార్యదర్శి జమ్ముల జితేందర్ రెడ్డి, రాష్ట్ర సమితి సభ్యులు యర్రాబాబు, జిల్లా కార్యవర్గ సభ్యులు తాటి వెంకటేశ్వర్లు, మేకల శ్రీనివాసరావు, నాయకులు గాడె లక్ష్మి నారాయణ తదితరులు ఉన్నారు.

# అలుపెరుగని పోరాట యోధుడు సిద్ధి

**- సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే.సాబీర్‌పాషా**



**ప్రజాపక్షం/పాల్వంచ :** స్వార్థ ప్రయోజనాల కోసం జెండాలు, ఎజెండాలు మారుస్తూ రాజకీయాలను భ్రష్టు పట్టిస్తున్న ప్రస్తుత తరుణంలో దానికి భిన్నంగా నమ్మిన సిద్ధాంతం కోసం కట్టుబడి కడదాకా ఒజే జెండాతో మమేకమైన నికార్సయిన కమ్యూనిస్టు నాయకులు, అలుపెరుగని పోరాట యోధుడు సిద్ధి వెంకటేశ్వర్లు అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా అన్నారు. సిపిఐ మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ కార్యదర్శి సిద్ధి వెంకటేశ్వర్లు 4వ, వర్ధంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సంధర్భంగా సిద్ధి వెంకటేశ్వర్లు స్మారక స్థూపానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముందుగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాధం సిపిఐ పతాకాన్ని ఎగురవేశారు. అనంతరం సాబీర్‌పాషా మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో ప్రజా ఉద్యమాలను తారా స్థాయికి చేర్చిపార్టీ బలోపేతానికి బాటలు వేసిన బలమైన నాయకుడు సిద్ధి వెంకటేశ్వర్లు అని, ప్రజలకు, పార్టీ అభివృద్ధికి చేసిన ఆయన సేవలను కొనియాడారు. విద్యార్థి సంఘం మొదలు యువజన, వ్యవసాయ, కార్మిక సంఘం రాష్ట్ర నేతగా, ఉమ్మడి ఖమ్మం జిల్లా పార్టీ కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా అనేక పదవులను చేపట్టి విజయవంతంగా నడిపించిన సిద్ధి ఆ పదవులకే వన్నె తెచ్చిన అరుదైన నాయకుడన్నారు. దేశంలో కార్పోరేట్ శక్తులకుయ వ్యతిరేకంగా తన గళాన్ని వినిపించి వ్యాపారుల్లో చెతన్యం చేశారని, ఆ రోజుల్లో కొందరు ఆయన మాటలను పెడచెవిన పెట్టారని కానీ మారిన పరిస్థితుల్లో వ్యాపారులు కమ్యూనిస్టుల అవసరాన్ని గుర్తిస్తున్నారని, సిద్ధి ఆశయ సాధన కోసం ప్రతీ కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచందర్‌రావు, ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు కొండలరావు, నిమ్మల రాంబాబు,ఇట్టి వెంకటరావు, కార్పోరేటర్ బోయిన విజయ, ప్రజా సంఘాల నాయకులు వల్లపు యాకయ్య, ఆలపాటి ప్రసాద్, సత్యనారాయణ, భుక్యా విజయ్, వేములపల్లి రాజశేఖర్, ఇరుకులపాటి సుధాకర్, రామాచారి, రాము, వెంకట్, బాబు, కిరణ్, వెంకన్న, అల్లి వెంకటేశ్వర్లు, వివిధ పార్టీల నాయకులు కనగాల అనంతరాములు, దొప్పలపూడి సురేష్, మానస శ్రీను, ఇటుకల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# సిద్ధి ఆశయసాధనకు కృషి చేయాలి

**- సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య**

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** అమరజీవి సిద్ధి వెంకటేశ్వర్లు ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ పునరంకితం కావాలని సిపిఐ కొత్తగూడెం పట్టణ కార్యదర్శి కంచర్ల జమలయ్య పిలుపునిచ్చారు. సిపిఐ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి, ఉమ్మడి ఖమ్మం జిల్లా సిపిఐ మాజీ కార్యదర్శి అమరజీవి సిద్ధి వెంకటేశ్వర్లు 4వ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం పట్టణంలోని సిపిఐ జిల్లా కార్యాలయం 'శేషగిరిభవన్'లో ఘనంగా జరిగింది. తొలుత సిద్ధి వెంకటేశ్వర్లు చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సభలో కంచర్ల జమలయ్య మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాణానికి, పార్టీ విస్తరణకు సిద్ధి వెంకటేశ్వర్లు చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం, ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఆయన జీవితాంతం రాజీలేని పోరాటాలు సాగించారని గుర్తుచేశారు. ఒక నిబద్ధత



కలిగిన నాయకుడిగా పార్టీ శ్రేణులకు ఎల్లప్పుడూ దిశానిర్ధేశం చేస్తూ మార్గదర్శిగా నిలిచారన్నారు. ఆయన అందించిన సేవలను స్ఫూర్తిగా తీసకుని రాబోయే రోజుల్లో ప్రజా ఉద్యమాలను మరింత ఉధృతంగా ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, వర్క అజిత్, పిడుగు శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వర్ రావు, మర్రి గోపికృష్ణ, బోయిన విజయ్‌కుమార్, గోవిందు, గుర్రం వెంకటేశ్వర్లు, గడ్డం సతీష్, కిరణ్, జానీ తదితరులు పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యతతో మెరుగైన జీవనం

**- ఐటిడిఏ పిఓ రాహుల్**

**ప్రజాపక్షం/భద్రాచలం :** నిరుద్యోగ యువతీ యువకులు వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని జీవనోపాధిని సుగమం చేసుకోవాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. శుక్రవారం ఐటిడిఏ ప్రాంగణంలో వైటిసిని సందర్శించిన ఆయన శిక్షణ పొందిన పొందుతున్న బ్యాచీలు, రాబోయే బ్యాచీల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అక్కడ శిక్షణ పొందుతున్న వారిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. శిక్షణను శ్రద్ధగా నేర్చుకుని వృత్తి నైపుణ్యాన్ని పెంచుకుని మందుకు సాగాలని, తద్వారా జీవనోపాధి అవకాశాలను మెరుగు పర్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేడిఎం హరికృష్ణ వైటిసి మేనేజర్ శ్రీనివాస్‌తో పాటు అనురాధ, అరుణ దినకుమార్ రజియా బేగం, రామ్ ప్రకాష్ సంధ్య జ్యోతి సమ్మయ్య తో పాటు తదితరులు పాల్గొన్నారు.

## వైద్య కళాశాల పనులు డిసెంబర్ నాటికి పూర్తి కావాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** పాల్వంచ మండల పరిధిలోని నిర్మితమవుతున్న వైద్య కళాశాల పనులు డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని కలెక్టర్ అంకింత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా శుక్రవారం నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.



పెండింగ్ పనులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. విద్యార్థులకు అవసరమైన అన్ని సదుపాయాలు మౌళిక సౌకర్యాలు సజావుగా ఉండేలా నిర్మాణాలు ఉండాలన్నారు. కొత్తగూడెం వైద్య కళాశాల్లో ప్రతీ ఏటా 150 మందికి ఎంబిబిఎస్ సీట్లు అందుబాటులో ఉన్నట్లు చెప్పారు. సుమారు 25 ఎకరాల విస్తీర్ణంలో నిర్మితమవుతున్న వైద్యకళాశాలలో అన్ని సదుపాయాలు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. భవిష్యత్ వసరాలను దృష్టిలోపెట్టుకుని పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య, ఇంజనీరింగ్, నిర్మాణ సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## పట్టా భూమిని చెరువుగా మార్చారని రైతు ఆవేదన

**ప్రజాపక్షం/బోనకల్ :** కలకోట రెవెన్యూ పరిధిలోని 1200 గజాల తమకు సొంతమైన పట్టా భూములను కొందరు వ్యక్తుల చేపల చెరువులుగా మార్చేశారని అదే గ్రామానికి చెందిన గుండ్ల కోటయ్య అనే రైతు ఆవేదన వ్యక్తం చేశారు. 2016 నుంచి పట్టా పాసుబుక్కుల కోసం అధికారులను కోరుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని తెలిపారు. అనుమతులు లేకుండా చెరువులకు విద్యుత్ వినియోగిస్తున్నారని రైతు ఆరోపించారు. ఇప్పటికే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు రైతు తెలిపారు. ఇప్పటికైనా రెవెన్యూ అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని రైతు డిమాండ్ చేశారు.



## రైతులకు యూరియా పంపిణీ

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలంలో పాలడుగు, గొల్లపూడి, సిరిపురం, పూసలపాడు, వైరా సొసైటీల పరిధిలో ఆన్‌లైన్‌లో యూరియా బుక్ చేసుకున్న రైతులకు 2670 బస్తాలు(120 మెట్రిక్ టన్నులు) పంపిణీ చేసినట్లు మండల వ్యవసాయ అధికారి మయాన్ మంజుఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆయా సొసైటీల పరిధిలో మరో 355 బస్తాలు(16 మెట్రిక్ టన్నుల) యూరియా నిల్వ ఉందని, ఆ నిల్వను కూడా ఆన్‌లైన్‌లో అందుబాటో ఉంచుతున్నట్లు తెలిపారు. రైతులు ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వెంటనే యూరియాను పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. యూరియా కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఆన్‌లైన్ బుకింగ్ ప్రకారం అందరికి సరఫరా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు వ్యవసాయశాఖ అధికారి మంజుఖాన్ తెలిపారు.



## నేడు మండల స్థాయి సమీక్ష సమావేశం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం ను నిర్వహిస్తున్నట్లు నేలకొండపల్లి ఎంపీడీఓ యం.యర్రయ్య సూచించారు. మండల పరిషత్ కార్యాలంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల స్పెషల్ ఆఫీసర్ కె.రవిబాబు ఆదేశాల మేరకు శనివారం మండల స్థాయి సమీక్ష సమావేశం ను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నీటి సంరక్షణ పనులు గురించి చర్చించనున్నట్లు తెలిపారు. పంచాయతీ మౌలిక వసతుల అభివృద్ధి పనుల అమోదం పురోగతి కార్యక్రమాల పై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. వీధి కుక్కల నియంత్రణ, కోతుల సమస్య, వీధి లైట్లు ఏర్పాట్లు పంచాయతీల ఆదాయం ఇతరత్రా మరియు 16 వ ఆర్థిక సంఘం గ్రాంట్లు వినియోగం పై సమీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. కావునా ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశం కు పంచాయతీ సర్పంచ్లు, ఆయా శాఖల అధికారులు సకాలంలో పాల్గొనాలని సూచించారు. ఈ విలేకర్ల సమావేశంలో మండల పంచాయతీ అధికారి యం.శ్రీనివాసరావు ఉన్నారు.



## నేలకొండపల్లిలో కందాళ పర్యటన

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** పాలేరు మాజీ శాసనసభ్యులు కందాళ ఉపేందర్ రెడ్డి శుక్రవారం పర్యటించారు. మండలం లోని ముజ్జుగూడెం, నేలకొండపల్లి, సింగారెడ్డిపాలెం గ్రామాలలో పర్యటించారు. పలు కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇటీవల అనారోగ్యంతో బాధపడుతున్న నేలకొండపల్లి మండల సోషల్ మీడియా అధ్యక్షుడు మాదాసు ఆదాం, పగిడికత్తుల సిద్ధు ను కందాళ పరామర్శించారు. ఆరోగ్య యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పలువురు ను పరామర్శించారు. ఆయన వెంట ఆయా పంచాయతీ సర్పంచ్ లు, పార్టీ .నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఎంపీడీఓ యర్రయ్యకు ఘనసన్మానం

**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** జిల్లా ఉత్తమ ఎంపీడీఓగా అవార్డు ను అందుకున్న నేలకొండపల్లి ఎంపీడీవో యం.యర్రయ్య ను శుక్రవారం ఘనంగా సన్మానించారు. పాలేరు డివిజన్ కాంగ్రెస్ నాయకులు రావెళ్ల కృష్ణారావు, బెల్లం వాసు లు మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రావెళ్ల కృష్ణారావు మాట్లాడారు. అన్ని శాఖల అధికారులను సమన్వయం చేసుకుంటూ, మండల ప్రజలకు సేవలందిస్తూ... అభివృద్ధిలో ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కోన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచనల మేరకు మండలం ను ఉత్తమ మండలంగా తీర్చిదిద్దుతున్నారని అన్నారు. ఇలాంటి అవార్డులు మరెన్నో పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.



## రుద్రంపూర్‌లో బెల్ట్ షాపులను తొలగించాలి

**- గ్రామసభ తీర్మానం మేరకు ఎక్సైజ్ అధికారులకు సర్పంచ్ బానోత్ కేస్లీ వినతి**

**ప్రజాపక్షం/చుంచుపల్లి:** రుద్రంపూర్ గ్రామపంచాయతీ పరిధిలో విద్యాసంస్థలు, దేవాలయాలు, మందిరాలు, చర్చిలకు సమీపంలో నిర్వహిస్తున్న అనధికార బెల్ట్‌షాపులను తక్షణమే తొలగించాలని రుద్రంపూర్ గ్రామపంచాయతీ సర్పంచ్ బానోత్ కేస్లీ కోరారు. ఈ మేరకు జిల్లా ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ సూపరిండెంట్ శ్రీనివాస్ రెడ్డి అధికారి సమక్షంలో ఎక్సైజ్ సీఐ జయశ్రీకి సర్పంచ్ బానోత్ కేస్లీ వినతిపత్రం అందజేశారు. ఇటీవల నిర్వహించిన గ్రామసభలో రుద్రంపూర్ గ్రామ ప్రజలు, మహిళలు బెల్ట్‌షాపుల నిర్వహణతో ఎదురవుతున్న ఇబ్బందులను గ్రామపంచాయతీ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు. గ్రామంలోని పాఠశాలలు, దేవాలయాలు, మందిరాలు, చర్చిలకు సమీపంలో కొందరు అనధికారికంగా బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు.

